# ఆడపిల్ల

జి. ఉషావిఠల్



జీతం తీసుకుని లెఖ్ఖపెట్టుకుంటూ సీటు దగ్గరకి వచ్చి, అక్కడే ఫైల్సు సర్దుతున్నట్టు నటిస్తూ నిల్చున్న ప్యూన్ వెంకటస్వామిని చూసి గతుక్కుమన్నాను. నన్ను చూడగానే, "నమస్కారం సార్!" అన్నాడు. అది వాడి 'కోడ్ వర్డ్!' అలాగంటే "నా వడ్డీడబ్బులు యిలా పడెయ్యి!" అని అర్థం! గవర్నమెంటాఫీసులో పని చేసే వుద్యోగి వడ్డీ వ్యాపారం చెయ్యకూడదనే రూలుంది గనక వాడు పబ్లిగ్గా అడగడు. వాడికీ వుద్యోగం సైడ్ బిజినెస్ లాంటిది. వాడి మెయిన్ బిజినెస్ వడ్డీ వ్యాపారం! నాలాంటి మధ్యతరగతి కుటుంబీకులంతా వాడి కస్టమర్స్! నిజానికి పోయిన నెలదాకా నాకు వాడి వ్యాపారం సంగతే తెలీదు. వాడి కస్టమర్సంతా వాడి రహస్యాన్ని అంత జాగ్రత్తగా కాపాడతారన్నమాట! పోయిన నెల మా పెద్ద అమ్మాయి పెళ్ళికి ప్రావిడెంట్ ఫండులో తీసుకున్న లోనూ, యింటి మీద తీసుకున్న అప్పు చాలక అవస్థపడుతూ వుంటే, స్నేహితుడు రామారావు వెంకటస్వామిని గురించి చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. వాడు రెండు వేలు రెండు నిముషాల్లో సర్దగలడంటే నాకెంతమాత్రం నమ్మకం కలగలేదు. కాని పొద్దున్న రామారావు చెప్పడం, సాయంత్రం ఆఫీసు వదిలే వేళకి నా చేతిలో డబ్బు పడటం చూసి, వాడి శక్తిసామర్థ్యాలని చాలా తక్కువగా అంచనా వేసినందుకు నేను చాలా నొచ్చుకున్నాను. వడ్డీ వసూలు చేసుకునే విషయంలో వాడి పద్దతులు ముందే రామారావు చెప్పి వుండటంచేత వాడు 'నమస్కారం సార్!' అనగానే వెర్రినవ్వొకటి నవ్వి, పేకెట్టు నుంచి వంద కాగితాలు రెండు తీసి వాడి చేతిలో పెట్టాను. వాడు వినయంగా వాటి నందుకుని నాకో థేంక్స్ పారేసి వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళాక కవర్లో నుంచి తొంగి చూస్తున్న మరో వంద కాగితాన్నీ, కాసిన్ని పది రూపాయల నోట్లనీ చూడగానే నా గుండె ఆగినంత పనైంది. ఈ డబ్బుతో నెలంతా గడపడం యీ రోజుల్లో మానవమాత్రుడి తరమా? పాలవాడు, కూరలమ్మి, పచారీకొట్టు షావుకారూ, పెద్దమ్మాయి పెళ్ళికి చీరలు సప్లై చేసిన బట్టల మూటల వ్యాపారి వరసగా సినిమాలో విలన్స్‌లాగా నవ్వుతూ నా ముందు నిల్చున్నట్టై నాకు ముచ్చెమటలు పోశాయి. ఈ డబ్బు యెవరికి యివ్వను? ఎవరి బాకీ చెల్లు పెట్టగలను? ఏ ధైర్యంతో చేశానీ అప్పులన్నీ?

ఎప్పటిలాగా రెండు జీతాలూ అందుతాయనేకదూ? వరలక్ష్మికి పెళ్లై పోయిందనీ, వరాలు జీతం అల్లుడికి చెందుతుందనీ నాకెందుకు తట్టలేదూ? పోనీ వరాల్ని సగం జీతం కొంత కాలంపాటు సర్దమంటే? ఛీ! ఛీ! ఇంతకాలం ఆడపిల్ల సంపాదన తిన్నది చాలక పెళ్ళయాక కూడా యే మొహం పెట్టుకుని అడగను? ఆఁ! అడిగితే తప్పేముంది? ఆడపిల్లయినా మొగపిల్లాడిలాగా చదివించేను. నానా గడ్డికరిచి, అక్కర్లేనివాళ్ళ కాళ్ళా పట్టుకుని యీ ఆఫీసులోనే ఉద్యోగం వేయించాను. నాకా మాత్రం హక్కు లేదూ? ఎందుకు లేదూ? నిక్షేపంలాగా వుంది. ఇప్పుడే దాని సెక్షన్‌కి వెళ్ళి అడుగుతాను. ఈపాటికి వరాలు కూడా జీతం తీసుకునే వుంటుంది.

క్రిందటి నెలదాకా "ఇంత డబ్బు నా దగ్గర వుంచుకోవాలంటే పారేస్తానేమోనని భయంగా వుంటుంది నాన్నా!" అంటూ జీతం తెచ్చి నాకు యిచ్చేసేది. ఈ నెల దానికా భయం లేదేమో! ఏమైనా ఆడపిల్లలు, ఆడపిల్లలే! పెళ్ళవగానే నా సంసారం, నా మొగుడూ అనుకుంటారుగానీ, యీ తండ్రి ముండావాడు నానా గడ్డికరిచి నాకో మొగుణ్ని సంపాదించి పెట్టాడే, వాడి బాధల్లో మనమూ పాలు పంచుకోవాలే – అన్న జ్ఞానం వాళ్ళకి వుండదు. ఛా! ఏమిటింత ఘోరంగా ఆలోచిస్తున్నానూ? కన్న తండ్రికి రావల్సిన ఆలోచనలేనా యివి? ఏనాడైతే దాన్నొక అయ్య చేతిలో పెట్టానో ఆనాడే అది పరాయిపిల్ల అయిపోయింది. ఆ పిల్ల నా కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలనుకోవడం యెంత నీచం? నేనే పది రూపాయలు దాని చేతిలో పెట్టాల్సిందిపోయి, దాని జీతం తెచ్చి నా చేతిలో పొయ్యలేదని యెలా అనుకోగలుగుతున్నాను? నా ఆవేశం చప్పున చల్లారిపోయింది. ఇంకా

నయం! గబుక్కున వెళ్ళి అడిగానుకాదు! ఎంత బాధపడి వుండేదో?

"నాన్నా!" అన్న పిలుపు విని ఆలోచనల నుంచి తేరుకుని తలెత్తి చూశాను. వరాలు యెదురుగా నిల్చుని వుంది. ఎంతసేపయిందో వచ్చి! నా ఆలోచనల్ని పసిగట్టలేదుకదా?

"ఏవిటమ్మా! యిలా వచ్చావు?" అన్నాను కాస్త ఖంగారుగా.

"ఇంత డబ్బు దగ్గరుంటే పారేస్తానేమోనని భయంగా వుంది నాన్నా! నీ దగ్గరుంచు!" అంది తన జీతం వున్న కవర్ని నా ముందుకి చాపుతూ! తెల్లబోయి చూశాను. నిజానికి వరాలు డబ్బు పారేసుకుంటాననే భయంతో జీతం తెచ్చి నాకివ్వడం లేదని నాకు తెలుసు. ఎందుకంటే మా అల్లుడు కూడా దాని సెక్షన్‌లోనే పని చేస్తున్నాడు. డబ్బు పారేసుకుంటాననే భయమే దానికి వుంటే, తిన్నగా జీతం తీసుకెళ్ళి అతనికిచ్చి వుండేది.

"ఏవిటి నాన్నా? అలా చూస్తున్నావు? ప్రతి నెలా నీ దగ్గరకి యిలాగే జీతం తెచ్చి యిచ్చేదాన్ని కదా? ఇవాళేమిటి వింతగా చూస్తున్నావు?" అంది వరాలు చిరునవ్వుతో! నాకు నోటమాట రాలేదు. దాని ఆలోచన నాకు అర్థమైంది. ఈ నా బంగారు తల్లి గురించి నేనెంత ఘోరంగా ఆలోచించాను? నేనెలాంటి తండ్రిని? సిగ్గుతో నా తల వాలిపోయింది.

"వద్దు! తల్లీ! తీసుకెళ్ళి అల్లుడిగారికియ్యి! న్యాయంగా నీ జీతం యికముందు అతనికి చెందాలి! నా వుద్దేశం మీ యిద్దరికీ చెందాలి." అన్నాను తడబడుతూ! పక్కనున్న ఓ కుర్చీని లాక్కుని సావకాశంగా కూర్చుంది వరాలు.

"నువ్వెన్నోసార్లు 'నా పెద్ద కొడుకువి నువ్వే తల్లీ' అనేవాడివి! ఆ మాట అప్పుడే మరిచి పోయావా నాన్నా! నిజంగా నేను నీ పెద్ద కొడుకునే అనుకునివుంటే పెళ్లవగానే 'నీ జీతం తీసుకెళ్ళి నీ భార్యకియ్యి' అని నువ్వు చెప్పేవాడివా? నా చెవులు పిండి నా జీతం తీసుకుని వుండేవాడివి! అవునా? మన యిద్దరి జీతాలతోనే యేదో ఫరవాలేదన్నట్టు గడిచే సంసారం నీ వొక్కడి సంపాదనతో గడవటం కష్టమని నాకు తెలీదా? అదిగో! నీకప్పుడే కోపం వచ్చేస్తోంది! 'నువ్వు వుద్యోగంలో చేరకముందు, నా ఒక్కడి రెక్కల కష్టంతో మిమ్మల్ని పోషించలేదా?' అని అడగ బోతున్నావు! అప్పటి పరిస్థితులు వేరు. పిల్లలందరం చిన్నవాళ్ళం! పైగా అన్ని వస్తువులూ కాస్త చవగ్గానే వుండేవి! నా పెళ్ళికి యెంత మొత్తుకున్నా వినకుండా, 'యింట్లో జరిగే మొదటి శుభకార్యం' అంటూ అప్పులు చేసి బోలెడంత ఖర్చు చేశావు........"

వరాలు చెప్తున్న ఒక్కొక్క మాటా నాకో సమ్మెట పోటులా తగులుతోంది. ఆమెని వారించే శక్తి లేనట్టు గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాను.

"........నీ అల్లుడికి తెలీకుండా జీతం తెచ్చి నీకిస్తున్నానేమోనని భయపడకు! మన పరిస్థితులన్నీ ఆయనకి చెప్పి ఆయన అనుమతితోనే నీకి డబ్బు యిస్తున్నాను. మధుకి ఉద్యోగం దొరికాక, నువ్వు యివ్వమన్నా నేను యివ్వను. ఏమిటి నాన్నా? ఇన్ని విధాలుగా చెప్తున్నా యింకా ఆ డబ్బుని పాముని చూసినట్టు చూస్తున్నావు?"

"అమ్మా! వరాలూ........" నా కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. వరాలు పుట్టినప్పుడు, 'ఆడపిల్లా!' అని నేను విరాళగా కళ్లు తేలవేస్తే—

"ఆడపిల్లా! అని అలా కళ్లు తేలేస్తావేమిరా? ఏనాటికైనా కన్నవారికోసం, యేం చెయ్యగలిగినా, చెయ్యలేకపోయినా వాళ్ళ కష్టాల్లో యిన్ని కన్నీళ్ళయినా కార్చేది ఆడపిల్లేరా వెర్రి వాడా!" అన్న మా అమ్మ మాటలు జ్ఞాపకానికి వచ్చాయి!

---

విజయవాడ రైల్వే మహిళల సంస్థ–రైల్వే ఉద్యోగుల భార్యలు, వారి పిల్లల సంక్షేమానికి కృషి చేస్తున్నది.

# శ్రీమతి హేమాదాస్



స్త్రీలకు తీరిక సమయాలలో కుట్టు పనులు, అల్లికలు, బొమ్మల తయారీ మొదలైన చేతి వృత్తులలో ఈ సంస్థ శిక్షణ ఇస్తున్నది. కుట్టుపని నేర్చుకుని రోజుకు ఇన్నిబట్టలు అని లెక్క ప్రకారం కుట్టి ఇస్తే నెలకు ఒక్కొక్క సభ్యురాలు రు 100ల వరకు సంపాదించవచ్చు. ఈ సంస్థకు శ్రీమతి హేమాదాస్ అధ్యక్షురాలు. విజయవాడ డివిజన్‌లోని రైల్వే ఉద్యోగుల భార్యలు, పిల్లలకు ఈ సంస్థ వారు తుపాను వచ్చినప్పుడు వస్తు రూపంలో, ధన రూపంలో సహాయం అందజేశారు.

ఈ సంస్థ విజయవాడలో మూడు పాఠశాలలను కూడా నడుపుతున్నది. నర్సరీ నుండి ప్రైమరీ వరకు తరగతులు గల స్కూలులో విద్యార్థుల సంఖ్య 1050. ఇందులో ఎల్. కె జి. యు కె.జి తరగతులలో 18 సెక్షన్లు ఉన్నవి. రైల్వే ఉద్యోగుల పిల్లలకు ఈ పాఠశాలల్లో ప్రవేశం లభిస్తుంది. ఇటువంటి స్కూల్సు బిట్రగుంట, రాజమండ్రి, విజయవాడలలో వున్నాయి.

శ్రీమతి హేమాదాస్ విజయవాడ డివిజనల్ సూపరింటెండెంట్ శ్రీ ఎం. సి. దాస్ భార్య. మద్రాసు, కాకినాడ, విజయవాడలో చదువుకున్నారు. 1961 లో ఆమెకు వివాహం జరిగింది. సంతానం యిద్దరు అమ్మాయిలు.

వివాహానికి ముందు కూడా ఆమె సాంఘిక సేవా కార్యక్రమాలలో ఎంతో ఆసక్తితో పాల్గొనేవారు. స్త్రీకి విద్య ఎంతో అవసరమని స్త్రీ స్వతంత్రంగా జీవించడానికి ఇది తోడ్పడుతుందని ఆమె అంటూ ఉంటారు. స్త్రీ స్వతంత్రంగా ఆలోచించి అభిప్రాయాలు ఏర్పరచుకోవాలని ఆమె సూచిస్తూ ఉంటారు. తను కట్నం యిచ్చి వివాహం చేసుకోలేదు కాబట్టి కట్నం ప్రసక్తి తనకు రాలేదని ఆమె చెప్పారు.

రైల్వే ఉద్యోగులలో నాల్గవ తరగతి కార్మికునికి ఎవరికైనా జబ్బు చేస్తే నెలకు రు 50 లు. చొప్పున ఆరునెలల వరకు ఈ సంస్థ సహాయం చేస్తుంది. అకస్మాత్తుగా ఏ కార్మికుడైనా మరణిస్తే ఈ సంస్థ అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తుంది.

రైల్వే ఉద్యోగుల పిల్లల్లో విద్యలో ప్రతిభ చూపిన వారికి స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసి వారిని ప్రతి ఏడాది ప్రోత్సహిస్తున్నది. శ్రీమతి హేమాదాస్ ఎన్నో పత్రికలలో కూడా వ్యాసాలు రాశారు. రేడియోలో ప్రసంగాలు యిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలంటే ఆమెకు ఎంతో యిష్టం. విజయవాడలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలకు వారు కుటుంబ సభ్యులతో హాజరవుతారు. —మీరా